క్లుప్తంగా

గోల్డ్ మెడల్ ప్రదానం



బాన్సువాడ: బాన్సువాడకు చెందిన సోనంగారి వర్షిణి అనే విద్యార్థిని శనివారం గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా గోల్డ్ మెడల్, సర్టిఫికేట్‌ను అందుకుంది. వర్షిణి ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ పరిధిలోని రుద్రూర్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించడంతో గవర్నర్..మెడల్‌తో పాటు సర్టిఫికేట్‌ను అందించారు. దీంతో వర్షిణిని కళాశాల అధ్యాపక బృందం అభినందించింది.

అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ



నస్రుల్లాబాద్: కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల సెలక్షన్‌లో గిరిజన గురుకుల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ మాధవ రావు అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అండర్–14 ట్రయథ్లాన్ విభాగంలో రాణా ప్రతాప్, అండర్–18 విభాగం జావెలిన్ త్రోలో బలరాం, లాంగ్ జంపులో ప్రతాప్ సింగ్ లు మొదటి స్థానం సాధించి బంగారు పతకం సాధించారన్నారు. అందులో భాగంగా వారిని ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత



తాడ్వాయి(ఎల్లారెడ్డి): కృష్ణాజీవాడిలో శనివారం బాధిత కుటుంబ సభ్యులకు మాదిగ సేవ సమితి ఆధ్వర్యంలో ఆర్థిక సహాయాన్ని అందించారు. గ్రామానికి చెందిన బండాల పెద్ద గంగయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలిసి మాదిగ సేవ సమితి సభ్యులు శనివారం గ్రామానికి వెళ్లి అంత్యక్రియలో పాల్గొని, మృతుడి కుటుంబ సభ్యులకు రూ.30 వేల నగదును అందజేశారు. సేవా సమితి వ్యవస్థాపకుడు గంగని శ్రీనివాస్, సభ్యులు శంకర్, అరుణ్, నవీన్, శ్రీకాంత్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

టేక్రియాల్‌లో బాధిత కుటుంబానికి..

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని టేక్రియాల్‌కు చెందిన రాయల శ్రీనివాస్ అనే వ్యక్తి మృతి చెందగా ఆయన కుటుంబానికి మాదిగ సేవా సమితి వ్యవస్థాపకులు గంగని శ్రీనివాస్ రూ. 30 వేల ఆర్థిక సహాయం అందజేశారు. పేద కుటుంబానికి చెందిన రాయల శ్రీనివాస్ అనారోగ్యంతో మృతి చెందగా మానవతా సహాయంగా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించామని గంగని శ్రీనివాస్ అన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపల్లి(ఖుర్దు)లో పారిశుద్ధ్య పనులను ఎంపీవో మలహరి శనివారం పరిశీలించారు.అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. పలు సూచనలిచ్చారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల అందజేత

పిట్లం(జుక్కల్): తిమ్మనగర్‌లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను శనివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జబింగే హన్మాండ్లు పంపిణీ చేశారు. అలాగే ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సురత్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

మద్నూర్(జుక్కల్): మద్నూర్, డోంగ్లీ ఉమ్మడి మండలాల్లో ఉపాధి హామీ పనులను శనివారం ఎన్ఎల్ఎం (నేషనల్ లెవెల్ మానిటరింగ్) టీం సుధాకర్‌రెడ్డి బృందం తనిఖీ చేసింది. మండలంలోని ఇలేగాఫ్, దోతి, మేనూర్ గ్రామ శివారులో జరిగిన పనులను పరిశీలించారు. ఈజీఎస్ ఏపీవో పద్మ, సిబ్బంది ఉన్నారు.

ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి సామ్యేల్

బాన్సువాడ: ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన నర్రె సాయిలును వెంటనే అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి సామ్యేల్ డిమాండ్ చేశారు. శనివారం బీర్కూర్ మండల కేంద్రంలో బాధితురాలితో కలిసి ఆయన మాట్లాడారు. బీర్కూర్‌కు చెందిన నర్రె సాయిలు అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన మహిళను తెలిసీ తెలియని వయస్సులో ప్రేమ పేరుతో నమ్మించి 16 ఏళ్లు సహజీవనం చేసి ఓ బాబుకు జన్మనిచ్చి ప్రస్తుతం ఆమెను రోడ్డున పడేశాడని అన్నారు. బాధితురాలిని కులం పేరుతో దూషించడమే కాకుండా ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేశాడని అన్నారు. నర్రె సాయిలుపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడం శోచనీయమని అన్నారు. నాయకులు పెద్దారం గంగారా, శివరాజ్, సాయిలు తదితరులు ఉన్నారు.

ప్రమాదాలకు నెలవు

- వారం వ్యవధిలో రెండు ప్రమాదాలు
- స్పందించని అధికార యంత్రాంగం



సిగ్నల్ లేకపోవడంతో అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనదారులు

బాన్సువాడ : బాన్సువాడ పట్టణంలో డేంజర్ స్పాట్‌లో రోజు రోజుకు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. అయినా అధికారులు మాత్రం తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పాత రామకృష్ణ టాకీస్ సమీపంలో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రాంతం నాలుగు రోడ్లకు కూడలిగా ఉంది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. బాన్సువాడ–బోధన్ రోడ్డు, బీసీ వసతి గృహం రోడ్డు, ఎన్‌జీవోఎస్ కాలనీ రోడ్లు ఇక్కడే కలుస్తాయి. వారం రోజుల క్రితం పట్టణానికి చెందిన ఓ యువకుడు బీసీ వసతి గృహం రోడ్డు నుంచి వచ్చి రోడ్డు దాటుతుండగా మరో యువకుడు బస్టాండ్ వైపునకు వెళ్లే క్రమంలో ఇరువురి బైక్‌లు ఢీకొన్నాయి. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇరువురికి ప్రస్తుతం నిజామాబాద్‌లో చికిత్స అందిస్తున్నారు. తర్వాత రోజున పట్టణానికి చెందిన సలీం అనే వ్యక్తి బైక్‌పై రోడ్డు దాటుతుండగా ఎదురుగా బైక్‌పై వచ్చిన మరో వ్యక్తి సలీం బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో సలీంకు తీవ్ర గాయాలయ్యాయి. ఇలా ప్రతీ నిత్యం ఈ డేంజర్ స్పాట్‌లో ఏదో ఒక ప్రమాదం జరుగుతున్నా అధికారులు స్పందించక పోవడం శోచనీయం.

సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటుకు గతంలో సన్నాహాలు..

ఇక్కడ నాలుగు రోడ్ల కూడలి ఉండటంతో గతంలో సిగ్నల్ లైట్లను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేసి వదిలేశారు. సిగ్నల్ లైట్ల కోసం స్టాండ్‌ను ఏర్పాటు చేసి లైట్లను మాత్రం మరిచిపోయారు. సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేస్తే తప్ప ఈ ప్రాంతంలో ప్రమాదాలు ఆగే అవకాశం లేదు. త్వరగా సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

అటవీ భూములను ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు



ప్రజలతో మాట్లాడుతున్న అటవీ శాఖాధికారులు

రాజంపేట : అటవీ భూములను ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని సెక్షన్ ఆఫీసర్ సయ్యద్ బాబా అన్నారు. శేర్ శంకర్ తండాలో హరితవనంలో భాగంగా ఫారెస్టు భూమిలో ఎన్ఆర్ఈజీఎస్ ఉపాధి హామీ కింద మొక్కలు నాటామన్నారు. జోగురాం గుట్ట తండాకు చెందిన కాట్రోత్ రవి, కాట్రోత్ సుభాష్, సూర్యతో పాటు మరో ఎనిమిది మంది నాటిన మొక్కలను తొలగించి.. ప్రశ్నించిన అధికారులపై బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. వీరికి రెవెన్యూలో ఒక్కొక్కరికి మూడు నుంచి పది ఎకరాల వరకు భూమి ఉన్నా ఫారెస్ట్‌ను ధ్వంసం చేసి అధికారులపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. వీరిపై విచారణ చేసి అటవీ శాఖ సెక్షన్ ప్రకారం పీడీ యాక్ట్ వంటి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని.. కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు.

బారులు తీరిన లారీలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని గోపాల్‌పేటలో గల మార్కెట్ కమిటీ గోదాం వద్ద ధాన్యం లారీలు బారులు తీరాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల రైస్ మిల్లుల నుంచి ధాన్యం తీసుకొచ్చిన లారీలు సకాలంలో ఖాళీ కాకపోవడంతో హైవే పక్కన ఉన్న సర్వీస్ రోడ్డుపై నిలిపారు. లారీల నుంచి ధాన్యం అన్‌లోడ్ చేసేందుకు కూలీల కొరత ఉండడంతో మూడు రోజుల నుంచి సర్వీస్ రోడ్డుపైనే లారీలు బారులు తీరాయి. దీనివల్ల ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

ఎరువులతో కంకి దశ అభివృద్ధి



బీబీపేట: మొక్కజొన్న పంట చివరి దశలో ఉన్నప్పుడు ఎరువులు వేయడం వల్ల కంకి దశ అభివృద్ధి చెందుతుందని మండల వ్యవసాయాధికారి నరేందర్ అన్నారు. శనివారం ఉప్పర్‌పల్లిలో మొక్కజొన్న పంట క్షేత్రాలను సందర్శించారు. మొక్కజొన్న ప్రస్తుతం కంకి ఏర్పడే దశలో ఉందని, ఆఖరి దఫాగా ఎరువులు వేయాలని దానితోనే కంకి అభివృద్ధి చెందుతుందని అన్నారు. యూరియా 25 కిలోలు, పొటాష్ 50 కిలోలు వేయాలని సూచించారు. కత్తెర పురుగుని గమనించి దానికి తగు మందులను వాడమని రైతులకు తెలియజేశారు.ఏఈవో రాఘువేంద్ర ఉన్నారు.

రాజంపేటలో ఎమ్మెల్యే పర్యటన



బీరయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్

రాజంపేట: మండలంలోని ఎల్లారెడ్డి నియోజకవర్గానికి సంబంధించిన ఆర్గొండ, కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి, గుండారం గ్రామాలలో ఇటీవల పలువురు అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబాలను శనివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యాన్ని కల్పించారు. ఆర్గొండలో పల్లె దవాఖానాకు మరమ్మతులు చేయించాలని డీఎంహెచ్‌వోకి ఫోన్ ద్వారా ఆదేశించారు. కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి గ్రామాల మధ్యలో నిర్మించిన ఆర్‌అండ్‌బీ బ్రిడ్జిలపైన పనులను త్వరగా పూర్తి చేయించాలని డీఈకి సూచించారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రణీత్ రెడ్డి, యూత్ మండల అధ్యక్షులు సల్మాన్, పాల్గొన్నారు.

పరామర్శ

భిక్కనూరు: రాష్ట్ర ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ కొమ్ముల తిర్మల్‌రెడ్డిని ఇఫ్‌కో సంస్థ మాజీ డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. వారం రోజుల క్రితం తిర్మల్‌రెడ్డి తల్లి లింగమ్మ మృతి విషయం తెలిసి ఆయనను ఓదార్చారు.

ప్రజల శ్రేయస్సు కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం



మద్నూర్(జుక్కల్): ప్రజల శ్రేయస్సు కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మద్నూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేశ్ పటేల్ పేర్కొన్నారు. డోంగ్లీ మండలంలోని మొగాలో శనివారం నూతన రేషన్‌కార్డు లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ హన్మంత్ పటేల్, నాయకులు సంగ్రామ్ పటేల్, మల్లుగొండ, రవికిరణ్, సాయిపటేల్, గంగాధర్ తదితరులున్నారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్



భిక్కనూరు: మండల కేంద్రంలోని సిద్దార్థ విద్యాలయంలో శనివారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. జంక్‌ఫుడ్ వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ బండి సుధాకర్, ప్రిన్సిపాల్ శ్రీకాంత్‌గౌడ్, ఉపాధ్యాయులు మోహన్‌గౌడ్, రవి, బాబు, వాసంతి, కల్పన భాస్కర్, సర్దార్, శైలజలు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి



నస్రుల్లాబాద్: మండలంలో ఎరువుల కొరత లేకుండా చూడాలని తహసీల్దార్ సువర్ణ అన్నారు. శనివారం మండలంలో గల ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు కృత్రిమంగా ఎరువుల కొరత సృష్టిస్తే క్రిమినల్ కేసులు పెడతామన్నారు. ప్రభుత్వం నిర్ధారించిన ధరలకే ఎరువులను పంపిణీ చేయాలన్నారు. స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఏవో భవానీ, ఎస్సై రాఘవేంద్ర, సీఈవో శ్రీనివాస్ ఉన్నారు.

హుండీల లెక్కింపు

మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ హుండీలను శనివారం దేవాదాయ ధర్మాదాయ పరిశీలకులు కమల సమక్షంలో లెక్కించారు. రెండు నెలలకు సంబంధించి 8 హుండీలను లెక్కించగా.. రూ. 2.13 లక్షలు వచ్చాయని ఆలయ ఈవో శ్రీధర్‌రావు తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రత్యేక ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వాలి'



కామారెడ్డి అర్బన్: ప్రత్యేక ఉపాధ్యాయులకు ప్రతి నెలా శిక్షణ కార్యక్రమాలతో పాటు విద్యార్హతలను బట్టి ప్రమోషన్లు కల్పించాలని ప్రత్యేక విద్యా ఉపాధ్యాయుల సంఘం(సెటా) విజ్ఞప్తి చేసింది. సెటా నాయకులు శనివారం డీఈవో రాజును కలిసి వినతి పత్రం అందజేశారు. సెటా జిల్లా అధ్యక్షుడు దాసరి నాగరాజు, ప్రధాన కార్యదర్శి అమీర్, ఉపాధ్యక్షుడు జి.శ్రీనివాస్, సంజీవ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

సాక్షి ఎఫెక్ట్..

బోర్డుపై పేర్ల మార్పు



నస్రుల్లాబాద్: బొమ్మన్‌దేవ్‌పల్లి జీపీ భవనంలో సమాచార శాఖ అధికారులు మారినా.. బోర్డుపై పేర్లు మాత్రం తొలగించలేదని శనివారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో స్వయంగా పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ బోర్డుపై పేర్లను మార్చారు.

వీధులు శుభ్రం



నస్రుల్లాబాద్: బొప్పాస్‌పల్లిలో వీధులను అధికారులు పరిశుభ్రం చేయించారు. శనివారం సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీవో రవీశ్వర్ గౌడ్.. స్థానిక పంచాయతి కార్యదర్శిని ఆదేశించడంతో అపరిశుభ్రంగా ఉన్న రోడ్లను గ్రామ పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించారు.

ఫంక్షన్ హాలు శుభ్రం



నస్రుల్లాబాద్: పర్మిట్ రూం కాదు.. ఫంక్షన్ హాలు అని జులై 16న సాక్షిలో వచ్చిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఫంక్షన్ హాలో ఉన్న మందు సీసాలను, ఇష్టారీతిన పడి ఉన్న చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామానికి దూరంగా ఉండటం.. మందు బాబులకు అడ్డాగా మారడంతో సిబ్బంది నిఘా పెంచారు.

కొనసాగుతున్న నిరాహార దీక్షలు



లింగంపేట ఎమ్మార్వో కార్యాలయం ముందు నినాదాలు చేస్తున్న కార్మికులు

సాక్షి నెట్‌వర్క్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు చేపడుతున్న నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరాయి. కార్యక్రమంలో భాగంగా పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు అందించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండి పెడుతున్న నిర్వాహకులకు ఆరు నెలలుగా బిల్లులు రావడం లేదని, అప్పులు చేసి పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం పెట్టిన మెనూ ప్రకారం ఒక్కో విద్యార్థికి రూ.25 ఖర్చు అవుతుందని, ప్రభుత్వం మాత్రం రూ.11 ఇచ్చి చేతులు దులుపుకుంటుందని విమర్శించారు. తక్షణమే వారి సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. పలువురు మద్దతు తెలిపారు.



బాన్సువాడలో..



బిచ్కుందలో..

పింఛన్ల పంపిణీ రోజులు పెంచాలి



బాన్సువాడలో పోస్టాఫీసు ఉద్యోగులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు

బాన్సువాడ: చేయూత పింఛన్ల పంపిణీ చేసే రోజులను పెంచాలని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు అన్నారు. శనివారం బాన్సువాడ పోస్టాఫీసు ఉద్యోగులతో ఆయన మాట్లాడారు. పింఛన్లను నాలుగు రోజులు మాత్రమే పంపిణీ చేయడంతో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి తెలియజేశారు. లబ్ధిదారులు వరుసగా మూడు నెలలు పింఛన్లు తీసుకోకుంటే చేయూత పింఛన్లు కట్ అవుతున్నాయని.. దీంతో పేదలకు అన్యాయం జరుగుతోందని అన్నారు. కనీసం వారం రోజులైనా పింఛన్లు పంపిణీ చేసేలా చూడాలని డీఆర్‌డీఏ పీడీకి ఫోన్‌లో వివరించారు.

హక్కుల సాధనే ధ్యేయంగా పని చేద్దాం



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న సంఘం నేతలు

నస్రుల్లాబాద్ : గీత కార్మికుల హక్కుల సాధనే ధ్యేయంగా పని చేద్దామని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్ గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం అమరుల యాదిలో గీతన్నల సామాజిక యాత్రలో భాగంగా నస్రుల్లాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18 వరకు జిల్లా వ్యాప్తంగా యాత్ర కొనసాగుతుందన్నారు. కల్లు గీత వృత్తి రక్షించడానికి అనేక మంది వీరులు పోరాటం చేసి హక్కులను సాధించుకున్నారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గౌడ్‌లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నేతలు మైశాగౌడ్, వెంకట్ గౌడ్, యాదగిరి గౌడ్, నర్సింలు గౌడ్, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'తల్లి పాలు శ్రేష్టమైనవి'



అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీవో, సూపర్‌వైజర్

నిజాంసాగర్ : బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవని బాన్సువాడ ఐసీడీఎస్ సీడీపీవో సౌభాగ్య పేర్కొన్నారు. శనివారం మహమ్మద్‌నగర్ మండలంలోని సింగితం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలను శిశువుకు తప్పనిసరిగా అందించాలన్నారు. అనంతరం చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు గంగమణి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

గౌరారంలో గుర్రం వీరహనుమాన్ ఎదుర్కోలు



గాంధారి(ఎల్లారెడ్డి): గౌరారంలో శనివారం గ్రామ శివారులో గల వీరహనుమాన్ ఆలయం నుంచి గుర్రంపై వీర హనుమాన్‌ను ఎదుర్కొని గ్రామంలో ఊరేగింపు తీసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి ఏటా శ్రావణంలో వీరహనుమాన్‌ను గుర్రంపై ఎదుర్కొని ఊరేగింపు తీస్తామన్నారు. అనంతరం గ్రామంలోని శ్రీసీతారామాంజనేయ ఆలయంలో అన్న ప్రసాదాల వితరణ చేశామన్నారు.

హనుమాన్ ఆలయంలో భక్తుల పూజలు

మద్నూర్(జుక్కల్): సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయం శ్రావణ శనివారం సందర్భంగా భక్తులతో సందడిగా మారింది. భక్తులు భారీగా తరలివచ్చి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

రేపు శివాలయంలో పూజలు

సోమవారం శివాలయాల్లో ప్రత్యేక పూజల కోసం ఏర్పాట్లు జరుగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మద్నూర్‌లోని సోమలింగాల శివాలయంలో, సలాబత్‌పూర్ శివాలయంలో భక్తులు అభిషేకాలు చేయనున్నారు. నెల రోజుల పాటు శివాలయాల్లో భజనలు, ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు జరుగనున్నాయి.

వేంకటేశ్వర ఆలయంలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక పూజలు, పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

భక్తి శ్రద్ధలతో శనేశ్వరుడికి తైలాభిషేకం



కామారెడ్డి అర్బన్: స్థానిక ఎస్ఆర్ గార్డెన్ సమీపంలో జయదుర్గా సమేత వైద్యనాథేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శని శింగనపురం కృష్ణశిల శనేశ్వరుడికి శ్రావణ శనివారం సందర్భంగా 11 కిలోల నువ్వులు, అష్టగంధ తైలం, తెల్ల, నల్ల నువ్వులు, నల్ల అవాలు, జిమ్మి ఆకులు తదితర ద్రవ్యాలతో భక్తి శ్రద్ధలతో తైలాభిషేకం నిర్వహించారు. శనేశ్వరున్ని పూజించడంలో భక్తులకు అనేక అనుమానాలున్నాయని, శనేశ్వరుని పూజ అనంతరం శివలింగంపై చెంబెడు నీళ్లు పోస్తే సరిపోతుందని వేదపండితులు జి.అంజనేయశర్మ అన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు లింగాగౌడ్, రవీందర్‌రెడ్డి, యాద అనిల్‌కుమార్, నవబోతు శ్రీనివాస్, పాత ధర్మరాజు, దేవాచారి, తదితరులు పాల్గొన్నారు.

వరుణుడి కరుణ కోసం అభిషేకాలు



నిజాంసాగర్(జుక్కల్): వరుణ దేవుడి కరుణించి వర్షాలు సంవృద్ధిగా కురువాలని కోరుతూ శనివారం మంగ్లూర్ గ్రామస్తులు వరుణ యాగాలు చేశారు. యువకులు, రైతులు పలు గ్రామాల్లోని అంజనేయస్వామి దేవుళ్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వానమ్మ...వానమ్మా ఒక్క సారి వచ్చి పో అంటూ పాటలు పాడుతూ బతుకమ్మ ఆడుతూ దేవుళ్లను కొలిచారు.

సంక్షిప్తం

పీఎం కిసాన్ నిధులు ఖాతాల్లో జమ

లింగంపేట(ఎల్లారెడ్డి): పీఎం కిసాన్ నిధులు రైతుల ఖాతాల్లో జమైనట్లు ఏవో అనిల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా లింగంపేట రైతు వేదికలో ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సందేశం రైతులు, అధికారులు దృశ్య మాధ్యమంలో వీక్షించారు. ఆయా గ్రామాలకు చెందిన 8,926 మంది రైతుల ఖాతాల్లో రూ. 2000 చొప్పున జమ అయినట్లు ఆయన పేర్కొన్నారు. ఎల్లారెడ్డి సహాయ వ్యవసాయ సంచాలకులు సుధామాధూరి, ఏఈవోలు రాకేష్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి భారీ సంఖ్యలో తరలి రావాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): యాద్రాదిలోని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద ఆదివారం సాంకేతిక సహాయకుల ఆధ్వర్యంలో జరిగే ఆత్మీయ సమ్మేళనానికి భారీ సంఖ్యలో తరలి రావాలని సాంకేతిక సహాయకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్ పిలుపునిచ్చారు. తాడ్వాయిలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారం, విధివిధానాలను చర్చించేందుకు ఈ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాడ్వాయి సాంకేతిక సహాయకుడు స్వామి తదితరులు ఉన్నారు.

నేడు భిక్కనూరులో అండర్–19 వాలీబాల్‌పోటీలు

భిక్కనూరు: మండల కేంద్రంలో ఆదివారం క్రీడాభారతి ఆధ్వర్యంలో అండర్–19 మండలస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, రమేశ్‌యాదవ్‌లు శుక్రవారం తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి ఒక జట్టుకు అవకాశం ఉందన్నారు.

విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలి

రాజంపేట: రైతులు పంట పొలాల వద్ద విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలని మండల విద్యుత్ అధికారి(ఏఈ) నాందేవ్ సూచించారు. రాజంపేటలో పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించి అవగాహన కల్పించారు. విద్యుత్ పొదుపు, ప్రమాదాలు.. భద్రత, అదనపు లోడు విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. లైన్‌మన్ మహమూద్, ప్రతాప్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు రైతు కుటుంబాలకు ఇన్సూరెన్స్ అందజేత

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని ఎన్‌డీసీసీ బ్యాంకు ఖాతాదారులు ఇద్దరు ఇటీవల మరణించారు. దీంతో వారి కుటుంబ సభ్యులకు శనివారం బ్యాంకు మేనేజర్ సాయిలు, బ్యాంకు డైరెక్టర్ రాంపటేల్ ఒక్కొక్కరికి రూ.2 లక్షల చెక్కులను అందించారు. మాక్స్ మేనేజర్ సంజీవ్, సిబ్బంది గంగాకిషోర్, విఠల్, సాయాగౌడ్, బాబురావ్, ముఖేష్, రైతులున్నారు.

బాలికల పాఠశాలలో సీడ్ బాల్స్ పంపిణీ

దోమకొండ: మండల కేంద్రంలోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం సీడ్ బాల్స్‌ను పంపిణీ చేశారు. కాగ్నిజెంట్ సంస్థ ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధి బాలప్రసాద్ చేతుల మీదుగా విద్యార్థినులకు సీడ్ బాల్స్‌ను అందజేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ సీడ్ బాల్స్ వృక్షజాతులను విస్తరింప జేస్తాయని ఆయన అన్నారు. బంతుల్లో మామిడి, మేడి, రాగి, మద్ది, మర్రి, జామ మరికొన్ని పళ్ల చెట్ల విత్తనాలతో రూపొందించి పంపిణీ చేశామని, వాటిని వివిధ ప్రాంతాల్లో వెదజల్లితే వృక్షజాతుల సంరక్షణ జరుగుతుందని ఆయన విద్యార్థినులకు వివరించారు. హెచ్ఎం శరత్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.